అదనపు ధాన్యం వివరాలు ఆర్‌బికెల్లో చెప్పండి

జెసి అరుణ్‌బాబు రైతులకు సూచన

ఏలూరు: ఖరీఫ్ పంటకు సంబంధించి అదనపు ధాన్యం సేకరణ విషయంలో జిల్లాలోని రైతుల వద్ద ఇంకా మిగిలి ఉన్న ధాన్యం వివరాలను తమ దగ్గరలోని రైతుభరోసా కేంద్రంలో తెలియజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌బికెలోని రెవెన్యూ, వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో రైతు కల్లం వద్దకు వెళ్లి రైతు భూమి, సాగు విస్తీర్ణం, సేకరించాల్సిన ధాన్యం పరిమాణం తదితర అంశాలను యాప్ ద్వారా నమోదు చేసిన అనంతరం అదనపు ధాన్యం సేకరణగా పరిగణిస్తారని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్లో ధాన్యం సేకరణను గత నవంబర్ ఆరో తేదీ నుండి ప్రారంభించామని, ఇప్పటివరకు 3.43 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. జిల్లాలోని రైతులంతా అధికారులతో సహకరించి ప్రభుత్వం కల్పించిన అదనపు ధాన్యం సేకరణను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ అరుణ్ బాబు విజ్ఞప్తి చేశారు.

'వంతులకు' రంగం సిద్ధం..!

రబీ నాట్లు దాదాపు పూర్తి

1 నుంచి వంతులవారీ విధానానికి సన్నాహాలు

నీటిఎద్దడి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు

ఉమ్మడి జిల్లాకు 4,600 క్యూసెక్కుల నీరు విడుదల

సీలేరు జలాలే ఆధారంగా ముందుకు

జీతాలు అందక లస్కర్లలో తీవ్ర అసంతృప్తి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రబీ సాగుకు సంబంధించి వంతులవారీ విధానంలో సాగునీటి సరఫరాకు అధికారులు సమాయత్తమవుతున్నారు. రబీనాట్లు దాదాపు పూర్తవడంతో ఇక నుంచి వంతులుగా సాగునీరు సరఫరా చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి వంతుల విధానం అమలు చేయనున్నట్లు సమాచారం. వంతులవారీ విధానంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే చర్యలకు సంబంధించి ఇరిగేషన్ అధికారులు ఇప్పటి నుంచే తీవ్ర కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రబీలో 4.60 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. 11 ప్రధాన కాలువలు, 400కుపైగా పిల్ల కాలువల ద్వారా డెల్టాలో సాగునీటి సరఫరా జరుగుతోంది. గోదావరిలో నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది. సీలేరులో జలవిద్యుత్ ఉత్పత్తి ద్వారా వచ్చే నీటిని సైతం ఇప్పటికే వినియోగిస్తున్నారు. ముందుముందు నీటి ఎద్దడి సమస్య మరింత పెరిగే అవకాశం ఉండటంతో సాగునీటి పంపిణీలో పలు చర్యలకు ఇరిగేషన్ అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. సాగునీటి సమస్య రాకుండా ఉండాలంటే ఉమ్మడి జిల్లాకు రోజుకు ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఆరు వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయాల్సి ఉంటుంది. దమ్ము నాట్ల సమయంలో సాగునీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. దమ్ము చేసే సమయంలో పొలాల్లో నీరు ఎక్కువగా ఉండాలి. దీంతో రబీనాట్లను దృష్టిలో పెట్టుకుని మొన్నటి వరకూ రోజుకు ఆరు వేలు, 5,500 క్యూసెక్కుల సాగునీరు విడుదల చేసేవారు. నీటి ప్రవాహాలు తగ్గడంతో ప్రస్తుతం 4,600 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదలవుతోంది. దాదాపు రబీ నాట్లు పూర్తవడంతో రైతులు మొదటి, రెండో విడత ఎరువులు చల్లడం వంటి నేపథ్యంలో సాగునీటి వాడకం తగ్గింది. దీంతో ప్రస్తుతం విడుదల చేస్తున్న నీరు సరిపోతోంది. ఎరువుల చల్లిక పూర్తయి వరి పైరు దుబ్బు చేసే సమయంలో నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. దీంతో వంతులవారీ విధానం అమలు చేసే తప్ప ప్రస్తుతం సరఫరా చేస్తున్న నీటితో ముందుకు సాగడం కష్టం. ఎండలు తీవ్రమయ్యే కొద్ది సాగునీటి సమస్య తీవ్రతరమయ్యే పరిస్థితి రానుంది. రానున్న సాగునీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే జిల్లా ఇరిగేషన్ అధికారులు వంతులవారీ విధానానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రతియేటా జనవరి 20వ తేదీ తర్వాత వంతుల విధానం అమలవుతోంది. అయినప్పటికీ రైతులు సాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. సాగునీటి కోసం రాత్రీ పగలు పడిగాపులు పడాల్సిన దుస్థితి వచ్చేది. ఈ ఏడాదైనా సాగునీటి సరఫరాలో తగు జాగ్రత్తలు తీసుకుని రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని అంతా కోరుతున్నారు. ఇరిగేషన్ అధికారులు ఏవిధంగా ముందుకు సాగుతారో వేచిచూడాలి.

తీవ్ర అసంతృప్తిలో లస్కర్లు

రబీలో సాగునీటి పంపిణీలో కాలువలపై పని చేసే లస్కర్లదే కీలక పాత్ర. వంతులవారీ విధానం అమలైతే లస్కర్లు రాత్రీ పగలు పని చేయాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 197 మంది లస్కర్లు కాలువలపై పని చేస్తున్నారు. వీరికి ఏడాదికి పది నెలల జీతం మాత్రమే ఇస్తారు. ఏప్రిల్, మే నెల జీతాలు ఇవ్వరు. అయితే పని మాత్రం చేయించుకుంటున్నారు. గడిచిన కొన్నేళ్లుగా ఏప్రిల్ 25వ తేదీ తర్వాతే కాలువల మూసివేత జరుగుతోంది. అప్పటి వరకూ లస్కర్లు పని చేయాలి. అంతేకాకుండా మే నెలలో క్లోజర్ పనులంటూ లస్కర్లను ఉపయోగించుకున్నా జీతాలు మాత్రం ఇవ్వడం లేదు. ఇచ్చే పది నెలల జీతాలైనా సక్రమంగా ఇస్తున్నారా అంటే అదీ లేదు. తొమ్మిది నెలలుగా లస్కర్లకు జీతాలు అందలేదు. ప్రతినెలా ఇచ్చే రూ.10,500 కూడా సకాలంలో ఇవ్వకపోవడంతో లస్కర్లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీతాలు ఇవ్వాలంటూ ఇటీవల నరసాపురం పర్యటనలో సిఎం జగన్‌ను కలిసినా ప్రయోజనం లేకుండాపోయింది. తమకు జీతాలు ఇప్పించాలని ఉమ్మడి జిల్లా ఉద్యోగ సంఘాల జెఎసి ఛైర్మన్, ఇరిగేషన్ ఉద్యోగ సంఘం నాయకుడు చోడగిరి శ్రీనివాస్‌ను లస్కర్లు ఆదివారం కలిసి తమగోడు వెళ్లబోసుకున్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి జీతాలు ఇప్పించాలని కోరారు. వంతుల వారీ విధానం అమలులో కీలక పాత్ర పోషించే లస్కర్లకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం, అధికారులు ఏవిధంగా స్పందిస్తారో వేచిచూడాలి.



ఇరిగేషన్ ఉద్యోగ సంఘం నేత శ్రీనివాస్‌ను కలిసిన లస్కర్లు

విధుల్లోకి చేరిన గంటకే పిఒ బదిలీ దారుణం

కలెక్టర్‌కు సిపిఎం లేఖ

ప్రజాశక్తి - ఏలూరు

ఐటిడిఎ పిఒగా నియమితులైన అధికారి బాధ్యతలు స్వీకరించిన గంటలోనే బదిలీ చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి గిరిజనుల పట్లం ఎంత చులకనభావం ఉందో అర్థమవుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆయన జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. ఆ వివరాలను ఆదివారం పత్రికలకు విడుదల చేశారు. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి కీలకమైన ఐటిడిఎలో ఇన్‌ఛార్జి అధికారుల పాలన సాగించడంతో గిరిజనాభివృద్ధికి తీవ్ర ఆటంకంగా ఉందని, ఐటిడిఎ పిఒగా ఐఎఎస్ అధికారులను నియమించాలని కోరారు. అనేకసార్లు ఆందోళనలు, నిరసనలు, వినతుల రూపంలో ప్రభుత్వానికి తెలియజేసినా ప్రభుత్వ వైఖరిలో మార్పు రాకపోవడం దారుణమని పేర్కొన్నారు. గిరిజనుల అభివృద్ధిని గాలికొదిలేయడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. రెగ్యులర్ పిఒ లేకపోవడం వల్ల గిరిజనులు తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం ఇనఛార్జి పిఒలు కేవలం ఐటిడిఎ సమావేశాలకే వచ్చి వెళ్తున్నారని, ప్రతి బుధవారం నిర్వహించే గిరిజన దర్బార్‌కు అధికారులు అందుబాటులో లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఐటిడిఎ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో నిర్మించిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం ఐటిడిఎ పిఒ ప్రత్యేక అధికారిగా ఉండి సమస్యలను పరిష్కరించేవారని తెలిపారు. కొంతకాలంగా ఇన్‌ఛార్జి పిఒలను నియమించడంతో సమస్యలన్నీ పేరుకుపోయాయని పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం తక్షణమే స్పందించి ఐఎఎస్ అధికారిని కెఆర్‌పురం ఐటిడిఎ పిఒగా నియమించాలని రవి డిమాండ్ చేశారు. డిఎంహెచ్ఒ, వెల్ఫేర్ డిడి తదితర అధికారులందరినీ నియమించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఐటిడిఎ అభివృద్ధి కోసం రెగ్యులర్ అధికారులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్లాలని కోరారు.

కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతం

12,524 మంది అభ్యర్థులు హాజరు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నగర పరిసరాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాత పరీక్ష కేంద్రాలను ఏలూరు రేంజ్ డిఐజి జి.పాలరాజు, జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ ఆదివారం తనిఖీ చేశారు. పాలరాజు నగరంలో ఏర్పాటు చేసిన 24 పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ప్రిలిమినరి పరీక్షలకు 14,228 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 12,524 మంది హాజరయ్యారు. కొంతమంది అభ్యర్థులు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు తీసుకురాకపోవడం, గెజిటెడ్ ఆఫీసర్ అటెస్టేషన్ లేకుండా కొంతమంది అభ్యర్థులు రాగా వారి వద్ద నుంచి డిక్లరేషన్ తీసుకుని పరీక్షకు అనుమతించినట్లు డిఐజి పాలరాజు తెలిపారు. పరీక్షా కేంద్రాలను ఏలూరు ఇన్‌ఛార్జి డిఎస్‌పి పైడేశ్వరరావు, జంగారెడ్డిగూడెం డిఎస్‌పి కెవి.సత్యనారాయణ, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్, ఏలూరు సిఐలు బి.ఆదిప్రసాద్, చంద్రశేఖర్, వరప్రసాద్ పర్యవేక్షించారు.

ఏలూరులో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి



సమావేశంలో ఫ్యాప్టో నాయకులు

అసంబద్ధంగా విద్యాశాఖలో పని సర్దుబాటు

ఫ్యాప్టో

ప్రజాశక్తి - ఏలూరు

ప్రస్తుతం విద్యాశాఖలో చేపడుతున్న పనిసర్దుబాటు సహేతుకంగా లేదని, అసంబద్ధంగా, అభ్యంతరకరంగా ఉందని ఫ్యాప్టో ఛైర్మన్ పిబివిఎస్ఎల్.నారాయణ, జనరల్ సెక్రటరీ జి.వెంకటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఏలూరులో ఆదివారం జరిగిన ఫ్యాప్టో సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుతం పని సర్దుబాటులో భాగంగా విడుదల చేసిన జాబితాలో టీచర్ల పని సర్దుబాటు విధానం మానసికంగా కుంగదీసే విధంగా ఉందన్నారు. వారికి కౌన్సెలింగ్ జరిపి సీనియర్లకు, జూనియర్లకు అంతరం తగ్గిస్తూ న్యాయం చేయాలని కోరారు. దీనిలో భాగంగా అన్ని సబ్జెక్టుల్లో కేడర్ సీనియారిటీ జాబితా తయారు చేయాలని, తదుపరి వారికి కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. పాఠశాలలను సందర్శించే అధికారులు విద్యావ్యవస్థను బలోపేతం చేసే విధంగా ఉండాలి తప్ప, షోకాజ్ నోటీసులు, సస్పెన్షన్ చేస్తూ చర్యలు తీసుకోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి లోతుపాతులు సరిచేసుకునే అవకాశం ఆయా టీచర్లకు, హెడ్‌మాస్టర్లకు ఇవ్వాలన్నారు. క్రమశిక్షణా చర్యల పేరుతో మానసికంగా కుంగదీయడం ఫ్యాప్టో పక్షాన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. వెంటనే పని విభజనపై కో ఆర్డినేషన్ మీటింగ్ జరిపి అందరికీ ఆమోదయోగ్యంగా కౌన్సెలింగ్ జరపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం నాయకులు ఎం.ఆదినారాయణ, సయ్యద్ జిలానీ, పివి.నరసింహారావు, రంగావలి, రామారావు, రవికుమార్, సాయిరాజు, భల్లం పాల్గొన్నారు.

వ్యకాస జాతీయ మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - టి.నరసాపురం

వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ టి.నరసాపురంలోని ప్రజాసంఘాల కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాలస్వామి ద్వారా వ్యవసాయ కార్మిక సంఘం జెండా ఆవిష్కరించారు. వచ్చేనెల 15, 16, 17, 18 తేదీల్లో పశ్చిమబెంగాల్‌లో ఈ మహాసభ జరుగుతుందన్నారు. ఈ మహాసభకు కార్మికులు సహాయ సహకారాలు అందించి, మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ, సరియం దుర్గమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి మడకం సుధారాణి, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే వైసిపి లక్ష్యం : దూలం

ప్రజాశక్తి - ముదినేపల్లి

సిఎం జగన్ ప్రవేశపెట్టిన పథకాలు పేదల అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. ముదినేపల్లిలో ఆదివారం గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఇంటింటికీ వెళ్లి వైసిపి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కుల, మత, ప్రాంత, పార్టీ విభేదాలు లేకుండా అన్ని వర్గాలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్‌ఎంపిపిలు సిహెచ్.సునీత, రాచూరి రాధా, వైసిపి మండల అధ్యక్షులు ఎం.ఏసుబాబు, గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, వైసిపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు నిమ్మగడ్డ భిక్షాలు, పార్టీ శ్రేణులు శీలం రామకృష్ణ,రాజులపాటి సూర్యప్రసాద్, ఈడే వెంకటేశ్వరరావు, బొర్రా శేషుబాబు, బేతపూడి వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు

నారాయణపురం వంతెనకు రూ.8.50 కోట్లు

పరిపాలనాపరమైన అనుమతులు పూర్తి

సాంకేతిక అనుమతుల కోసం అధికారుల సర్వే

డిపిఆర్‌కు గ్రీన్‌సిగ్నల్ లభిస్తే వేసవిలోనే పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఏలూరు కాలువపై నారాయణపురం ఆర్‌అండ్‌బి వంతెనను తొలగించి కొత్త వారధి నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలనాపరమైన అనుమతులిచ్చి రూ.8.50 కోట్లు నిధులు కేటాయించారు. దీంతో అధికారులు తదుపరి చర్యలు ప్రారంభించారు. చేబ్రోలు-ఉండి రాష్ట్రీయ రహదారి (ఆర్‌అండ్‌బి) నారాయణపురం వద్ద ఏలూరు కాలువపై 1936లో బ్రిటీష్ పాలకులు ప్రస్తుతం ఉన్న వంతెనను నిర్మించారు. కొల్లేరు ముఖద్వారంగా పేరొందిన ఈ వంతెన మీదుగా భీమవరం, గణపవరం నుంచి ఆక్వా, వరి, పలు పరిశ్రమల ఉత్పత్తుల రవాణా సాగుతోంది. అంతేకాకుండా భీమవరం నుంచి తెలంగాణా రాష్ట్రం సత్తుపల్లి వరకూ ఆర్‌టిసి బస్సు రూటు కూడా ఇదే వంతెన మీదుగా వెళ్తోంది.

రాకపోకలతో రద్దీగా ఉన్న నారాయణపురం వంతెన

ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ వంతెన శిథిలావస్థకు చేరి సుమారు పుష్కర కాలంపైనే అయ్యింది. ఈ వంతెన శ్లాబు కింద చువ్వలు తుప్పుపట్టి పెచ్చులూడటం, ఓ ఖానా కొంతవరకూ కుంగిపోవడం జరిగింది. అప్పటి నుంచి మాజీ మంత్రి వట్టి వసంతకుమార్, మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు సైతం వంతెన నిర్మాణానికి కృషి చేసినా కార్యరూపం దాల్చలేదు. గణపవరంలో జరిగిన సభలో ముఖ్యమంత్రి జగన్ దృష్టికి ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు ఈ వంతెన సమస్యను తీసుకెళ్లడంతో ఓ కొలిక్కి వచ్చినట్లు చెబుతున్నారు.

సైట్ ప్లాన్ సర్వే పనులు ప్రారంభం

నారాయణపురం వంతెన నుంచి సుమారు 50 మీటర్ల వరకూ ఆర్‌అండ్‌బి రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలకు గురైంది. పరిపాలనాపరమైన అనుమతులు రావడంతో సాంకేతిక అనుమతుల కోసం అవసరమైన సైట్ సర్వే పనులను ఆర్‌అండ్‌బి ఎఇ భాస్కరరావు ప్రారంభించారు. ప్రస్తుత వంతెన ఎంత విస్తీర్ణంలో ఉంది, వంతెన నిర్మాణానికి అవసరమైన స్థలం ఎంత కావాలి, ఎంత అందుబాటులో ఉంది, ఎంత ఆక్రమణలో ఉంది, ఆయా ఆక్రమణల్లో ఏయే కట్టడాలు ఉన్నాయి, నేల స్వభావం తదితర అంశాలపై సైట్ ప్లాన్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇక్కడ క్షేత్రస్థాయి రిపోర్టు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని, అక్కడ నుంచి వంతెన డిజైన్ (డిపిఆర్) సిద్ధం చేస్తారని, ఆపై వంతెన నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంటుందని ఎఇ భాస్కరరావు చెప్పారు. డిపిఆర్ పూర్తయితే ఈ వేసవిలోనే నిర్మాణ పనులు ప్రారంభించే అవకాశం ఉంది.

సామర్థ్యానికి మించి వాహనాల రాకపోకలు

వంతెన మీదుగా 40 టన్నులకు పైబడి వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. సామర్థ్యానికి మించి భారీ వాహనాల రాకపోకలతో వంతెన ఎక్కడ కూలిపోతుందో అనే భయాందోళనతో స్థానికులు ఉంటున్నారు.

వీడనున్న ఇరుకు వంతెన ఇబ్బందులు

మొదట్లో ఈ వంతెన మీదుగా రెండు భారీ వాహనాలు ఒకేసారి వెళ్లేవి. ఫత్తేపురం తదితర కొల్లేరు గ్రామాలకు తాగునీటి పథకం పైపులు ఈ వంతెన మీద నుంచే వేశారు. అప్పటి నుంచి ఇరుకు వంతెనగా మారింది. అంతేకాకుండా ఆక్రమణలతో రోడ్డు ఇరుకై నిత్యం ట్రాఫిక్ సమస్యలతో స్థానికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా కొత్త వంతెన నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యకు మోక్షం కలగనుందని గ్రామస్తులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

వంతెన కింద శ్లాబు తుప్పుపట్టి బయటపడిన ఐరన్ రాడ్లు

చిరస్మరణీయులు.. ఆచార్య కెవి

నేడు విశాఖపట్నంలో సంస్మరణ సభ

ఆచార్య కెవిగా ప్రసిద్ధి చెందిన కాట్రగడ్డ వెంకటేశ్వర్లు ఆంధ్ర విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగంలో తనదైన శైలిలో భోదన చేస్తూ విద్యార్థులను ప్రభావితం చేశారు. 1983-85 మధ్యకాలంలో నేను విద్యార్థిగా ఉన్నప్పుడు మాకు 'పబ్లిక్‌పాలసీ అనాలిసిస్' అనే పాఠ్యాంశం కెవి బోధించేవారు. ఏ ప్రభుత్వ విధానమైనా ప్రజలకు ప్రయోజనం కలిగేలా ఉండాలని, ఏ ప్రభుత్వమైనా ప్రజాశ్రేయస్సు ప్రాతిపదికగా విధానాలు రూపొందించాలి అనేవారు. విధాన నిర్ణయాల అమలులో చిత్తశుద్ధి ఉండాలని, అప్పుడే లక్ష్యాలను చేరుకోగలమని, ఏ విధానాలను.. ఎలా తీసుకోవాలి.. ఎలా అమలు చేయాలి అనే దానిని తర్కబద్ధంగా చెప్పేవారు. ఆయన భారతదేశంలోని బ్రిటీష్ పూర్వ గ్రామీణ వ్యవస్థపై పరిశోధనలు చేశారు. ఆనాటి స్వయంప్రతిపత్తి గ్రామాలను తర్వాత కాలంలో బ్రిటీష్ ప్రభుత్వం తమ రాబడి కోసం ఏ విధంగా విచ్ఛిన్నం చేసిందో తరగతుల్లో వివరించేవారు. ఆచార్య కెవి క్రమశిక్షణకు మారుపేరు. సమయపాలన పాటించేవారు. వామపక్షభావాలను పూర్తిగా అధ్యయనం చేసి ఆచరణలో చూపించిన మహనీయులు కెవి.

'మహాభారతంలో రాజనీతి' అనే అంశంపై పరిశోధన చేశారు. ప్రముఖ చరిత్రకారుడు డిడి.కోశాంబితో సన్నిహితంగా ఉండేవారు. ప్రముఖ ఆచార్యులు పి.కృష్ణప్రసాద్, ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు, కీర్తిశేషులు ఆచార్య ఎంఎస్ఎస్.కోటేశ్వరరావు, వై.వెంకటేశ్వరరావు (వైవి), ఎస్‌టి కార్పొరేషన్ ఛైర్మన్ కుంచా రవిబాబు తదితరులు కెవి విద్యార్థులే. బివి.రాఘవులు, నరసింగరావు (వైజాగ్) తదితరులతో సన్నిహిత సంబంధాలు ఉండేవి.

'నక్సల్‌బరీ మూవ్‌మెంట్ ఏన్ ఐడియాలాజికల్ సర్వే' అనే అంశంపై ఆర్.కుప్పానాయుడుచే పరిశోధన చేయించారు. ఇది ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్ ఉద్యమంపై జరిగిన తొలి పరిశోధనా అంశం. ప్రగతిశీల భావాలతో వామపక్ష వాదిగా ఉండే అనేకమంది విద్యార్థి నాయకులకు, విద్యార్థులకు ఆంధ్రా యూనివర్సిటీలో భారత రాజకీయాల పట్ల ఆసక్తి పెంచడానికి, అవగాహన పెంచడానికి స్టడీసర్కిల్ ఏర్పాటు, నిర్వహణను ప్రోత్సహించారు. ఆయన రాసిన 'డెమోక్రసీ ఎట్ వర్క్' అనే పుస్తకంతోపాటు పలు పుస్తకాలు రచించారు. తెలుగు అకాడమీ ప్రచురించిన అనేక పుస్తకాలకు సంపాదకుడిగా వ్యవహరించారు. గత సెప్టెంబరులో నేను రాజమండ్రిలో వారి కుమారుడు శ్రీనివాస్ ఇంట్లో ఆచార్య కెవిని కలిసినప్పుడు చాలా ఆప్యాయంగా మాట్లాడుతూ వామపక్ష భావాల విస్తృతి కోసం డాక్టర్ స్టాలిన్, డివివిఎస్.వర్మ చేసే ప్రయత్నాలను ఎంతగానో ప్రశంసించారు. ఆచార్య కెవి ఈ నెల పదో తేదీన రాజమండ్రిలో చిన్నకుమారుని ఇంటి వద్ద తుదిశ్వాస విడిచారు. ఎంతోమంది విద్యార్థుల అభిమానాన్ని, మేధావుల ప్రశంసలు అందుకున్న ఆచార్య కెవి సదా చిరస్మరణీయులు.

- డాక్టర్ బివివి.బాలకృష్ణ
రిటైర్డ్ ప్రొఫెసర్, రాజనీతిశాస్త్ర విభాగం
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం
రాజమహేంద్రవరం

ఎంఎల్ఎకి వ్యతిరేకంగా బ్యానర్ కట్టామని..

అక్రమ కేసులు పెట్టి నిర్బంధం

మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు నాగజగన్‌బాబూరావు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ఆదేశాలతో తమపై పోలీసులు అక్రమ కేసులు పెట్టి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శేవా నాగజగన్‌బాబూరావు అన్నారు. ఆదివారం ముదినేపల్లిలోని మాలమహానాడు, అనుబంధ సంఘాల జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదినేపల్లిలో శనివారం జరిగిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎంఎల్ఎ వచ్చారన్నారు. ఆయనకు వ్యతిరేకంగా వైసిపి మద్దతుదారులు ఎంఎల్ఎకు వ్యతిరేకంగా గోబ్యాక్ దూలం నాగేశ్వరరావు అని బ్యానర్ కట్టారని తెలిపారు. దళితులంతా కలిసి ఎన్నికల్లో నాగేశ్వరరావు గెలిపించామని, గెలిచిన తర్వాత దళితులను అణగదొక్కడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇందుకు నిరసనగా గడపగడపకూ మన ప్రభుత్వంలో భాగంగా అంబేద్కర్‌నగర్ వచ్చిన నాగేశ్వరరావుకు గోబ్యాక్ బ్యానర్ పెట్టామన్నారు. దీంతో తనపై, మాదిగ దండోరా జిల్లా అధ్యక్షులు ఏసుపోగు దానియేలుపై అక్రమ కేసులు పెట్టి పోలీసులు దారుణంగా ముదినేపల్లి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారని తెలిపారు. అదేవిధంగా బాబూరావు పిల్లలను, భార్యను, ఇంట్లో పెట్టి తలుపులు వేసి పోలీసులు నిర్బంధించి, బెదిరించారని బాబూరావు తెలిపారు.

బాలోత్సవానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు

వచ్చేనెల నాలుగు, ఐదు తేదీల్లో జరిగే బాలోత్సవానికి విద్యార్థులు తరలిరావాలని హేలాపురి బాలోత్సవం కమిటీ అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక పవర్‌పేటలోని బాలోత్సవం ఆఫీసులో సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆయా పాఠశాలల విద్యార్థులు బాలోత్సవం దరఖాస్తులు త్వరగా అందించాలని కోరారు. కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు బాలోత్సవం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ సమావేశంలో కూచిపూడి సత్యనారాయణ, ఎంజిఎస్.వెంకటరత్నం, వి.సురేష్, వి.కనకదుర్గ, వై.ఆనంద్‌నాయుడు, పి.మంగరాజు, ఎస్.కస్తూరిరావు, ఎబిటి.సుందరి, ఎన్.గంగాభవాని, వి.హరినారాయణ, డి.దిలీప్‌కుమార్, మేతర అజయ్ బాబు, పి.పండరినాథ్, కూన కృష్ణారావు, కె.విజయ లక్ష్మి, పి.కిషోర్, ఎస్ఎన్.కట్టా, పి.ఆదిశేషు, తోట రవి కుమార్, పి.రవికిషోర్, బి.మోహనరావు, కె.లెనిన్ బాబు, ఎం.ఇస్సాక్, డి.గణేష్, జి.రవీంద్ర పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

సత్యనారాయణ మృతి తీరని లోటు : సిపిఎం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వివిధ ప్రజా సమస్యలపైన, ఎర్రకాలువ మిగులు భూములను పేదలకు పంచాలని కోరుతూ అలుపెరుగని పోరాటం చేసిన ఆవుల సత్యనారాయణ మృతి తీరని లోటు అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. ఆదివారం మండలంలోని తాడువాయిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సిపిఎం గ్రామ మూడో శాఖ కార్యదర్శి ఆవుల సత్యనారాయణ సంతాప సభను మండల కార్యదర్శి ఎం.జీవరత్నం అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎ.రవి సత్యనారాయణ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎ.రవి మాట్లాడుతూ తాడువాయిలో నాలుగేళ్లుగా నిత్యం సిపిఎం శాఖ కార్యదర్శిగా పార్టీ ఆశయాల కోసం, భూ పోరాటాలు స్థానిక సమస్యలపై సత్యనారాయణ పోరాటం ఎనలేనిదన్నారు. అలాగే ఎర్రకాలువ భూముల్లో కొబ్బరి చెట్ల కోసం పోరాటం చేసి పేదలకు వచ్చిన ఫలసాయాన్ని అందించడంలో సత్యనారాయణ కృషి మరువలేనిదన్నారు. సిపిఎం ఆశయాలు, ప్రజాసంఘాల ఐక్యత, పార్టీ అభివృద్ధి కోసం సత్యనారాయణ పాటుపడ్డారని కొనియాడారు. ఈ సభలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తెల్లం దుర్గారావు, మండల కమిటీ సభ్యులు జి.సూర్యకిరణ్, ఎ.ప్రభాకరరావు, యాగంటి సీత, రాంబాబు, పటాన్ మస్తాన్, పట్టణ కమిటీ సభ్యులు పసల సూర్యారావు, ఎస్‌కె.సుభానీషా పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చింతలపూడి

విజయవాడకు చెందిన విజిఆర్ డయాబెటిస్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో చింతలపూడి శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ప్రధానోపాధ్యాయులు బి.సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరికీ డయాబెటిస్ వ్యాధిపై అవగాహనుండాలని ఆ మహమ్మారి బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లోనే కాకుండా వారి తల్లిదండ్రుల్లోనూ డయాబెటిస్‌పై అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల రీజనల్ ఇన్‌ఛార్జి పార్థసారథి , జోనల్ కో ఆర్డినేటర్ ఉదయభాస్కర్, డీన్ మధుబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయ రహదారులపై ఉదయం వాకింగ్ సరికాదు

ప్రజాశక్తి - భీమడోలు

జాతీయ రహదారిపై స్థానికులు తెల్లవారుజామున ఉదయం నడక సరికాదని, కొన్నిసార్లు ప్రమాదాలు చోటుచేసుకుంటాయని ఎస్ఐ చావా సురేష్ తెలిపారు. భీమడోలుకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి ఒకరు తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో జాతీయ రహదారిపై భీమడోలు నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో గల సూరప్పగూడెం వరకు ఉదయం నడక చేస్తుంటారని, ఈ క్రమంలో రెండు రోజుల క్రితం వాహనం ఢీకొని ఏలూరులోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. ఈ క్రమంలో హైవేపై స్థానికులు తెల్లవారుజామున ఉదయం నడక కార్యక్రమాన్ని మానుకుంటే బాగుంటుందని, దీనికోసం వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఎస్ఐ సూచించారు.

విద్యార్థులు బాలోత్సవ్‌లో పాల్గొనాలి

ప్రజాశక్తి - భీమడోలు

ఏలూరు సిఆర్ఆర్ పబ్లిక్ స్కూల్లో వచ్చేనెల నాలుగు, ఐదు తేదీల్లో నిర్వహించే హేలాపురి బాలోత్సవ్‌ను విజయవంతం చేయాలని యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రవికాంత్, బాలభాస్కర్ కోరారు. ఏలూరుతో పాటు దాని పరిసరాలకు చెందిన ఐదు మండలాల్లోని సుమారు 570 ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో మూడు నుంచి పదో తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులు ఈ సందర్భంగా నిర్వహించే పోటీల్లో పాల్గొనొచ్చన్నారు. అకాడమిక్, కల్చరల్ విభాగాల వారీగా పోటీలను నిర్వహించి 400 మంది విజేతలకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలను నిర్వాహకులు అందజేస్తారని వారు తెలిపారు. భీమడోలు మండలం నుంచి అత్యధిక సంఖ్యలో విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని వారు కోరారు.

పఠనాసక్తి పెంచేందుకు 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచేందుకు ప్రతీ ఆదివారం ఏర్పాటు చేస్తున్న 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని భీమడోలు శాఖా గ్రంథాలయ పాలకులు కె.శ్రీనివాసరావు కోరారు. శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు గ్రంథాలయంలో ఉన్న పుస్తకాల్లో విద్యార్థులు తమకు ఇష్టమైన పుస్తకాన్ని ఎంపిక చేసుకుని చదివారు. వాటిపై విశ్లేషణ చేసుకోవాల్సిన తీరును గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రముఖుల జీవితాలను పుస్తక రూపంలో చదివినప్పుడు వారు ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు ఎదుర్కొన్న సమస్యలు, వాటిని అధికమించిన తీరును స్ఫూర్తిగా తీసుకొని తమ భవిష్యత్‌ను సాగించాలని కోరారు.

నేరాలు - ఘోరాలు

అంతర్రాష్ట్ర మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

తాటియాకులగూడెంలోని ఎస్ఇబి అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద ఎస్ఇబి సిఐ మణికంఠ రెడ్డి అధ్వర్యంలో చేపట్టిన వాహన తనిఖీల్లో అంతర్రాష్ట్ర మద్యంను స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి విశాఖ జిల్లాకు కారులో తరలిస్తున్న నాలుగు బాటిళ్ల గోవా రాష్ట్రానికి చెందిన మద్యాన్ని పట్టుకున్నామని ఎస్ఇబి సిఐ మణికంఠ రెడ్డి తెలిపారు. కారు, మద్యం సీజ్ చేసి అక్కబత్తుల మధు సుధాకర్‌ను అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఇబి సిబ్బంది ప్రవీణ్, శ్యామ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

శరవేగంగా జగనన్న ఇళ్ల నిర్మాణం

ఉగాది నాటికి అధిక సంఖ్యలో గృహ ప్రవేశాలకు చర్యలు - కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన వేగవంతం - హౌసింగ్ అధికారి సతీష్

ప్రజాశక్తి - భీమడోలు

ఉగాది నాటికి మండలంలో అత్యధిక సంఖ్యలో గృహప్రవేశాలకు సిద్ధమయ్యేలా చర్యలు చేపడుతున్నామని గృహనిర్మాణ సంస్థ భీమడోలు సహాయ ఇంజినీర్ సిహెచ్.సతీష్ తెలిపారు. గృహనిర్మాణాలను పరిశీలించేందుకు ఆదివారం గుండుగొలను వైఎస్ఆర్ కాలనీకి వచ్చిన సహాయ ఇంజినీర్ మాట్లాడుతూ గృహ నిర్మాణాలను పూర్తిచేయడంలో భీమడోలు మండలం జిల్లాలో నాలుగో స్థానంలో ఉందన్నారు. ఈ స్థానాన్ని మరింత మెరుగుపరచుకునేందుకు భీమడోలు మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఆడిట్ అధికారి ఎవిఆర్.గంగాధరరావు, భీమడోలు ఎంపిడిఒ రాఘవన్ నేతృత్వంలో ప్రతీ శనివారం హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, వివిధ కాలనీల్లో గృహ నిర్మాణాల సంఖ్యను పెంచేందుకు అవసరమైన చర్యలు వారి సహకారంతో తీసుకుంటున్నామని వివరించారు. గృహనిర్మాణాలు కొనసాగుతున్న కాలనీలకు కనీస సదుపాయాల కల్పనకు అవసరమైన అనుమతులు, నిధుల మంజూరుకు శాసనసభ్యులు పుప్పాల వాసుబాబు తనవంతు సహాయ సహకారాలు అందజేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం మండలంలో 30 లే అవుట్‌లలో గృహ నిర్మాణాలు చేపట్టామన్నారు. వీటిలో పూళ్ల గ్రామపంచాయతీ పరిధిలోని నాగేశ్వరరావుపేట, హరిజనపేట మినహా ఇతర ప్రాంతాల్లో నిర్మాణాలు ప్రారంభమయ్యాయన్నారు. మండలస్థాయిలో గృహనిర్మాణాల లక్ష్యం 2086 కాగా ఇంతవరకూ 1400 నిర్మాణాలు ప్రారంభమయ్యాయన్నారు. వీటిలో 770 గృహనిర్మాణాలు పూర్తయ్యాయని, 172 ఇళ్ల శ్లాబులు పూర్తయ్యాయని తెలిపారు. 104 ఇల్లు శ్లాబ్ స్థాయికి చేరుకున్నాయని, 354 ఇళ్ల నిర్మాణాలు పునాది స్థాయి దాటాయన్నారు. 688 ఇళ్ల ప్రారంభించాల్సి ఉందన్నారు. వీటిలో 77 వరకు సొంత స్థలాలున్నాయన్నారు. అత్యధిక సంఖ్యలో గుండుగొలను లే అవుట్ లేఔట్ లో 394 వరకు నిర్మాణాలు ప్రారంభం కావలసి ఉందన్నారు. ఇటీవల ఉన్నతాధికారు నిర్వహించిన హౌసింగ్ డే సందర్భంగా ఒక్క రోజునే గుండుగొలనులో 75 మంది గృహనిర్మాణాలు చేపట్టేందుకు సంసిద్ధత వెలిబుచ్చారన్నారు. పోలసానిపల్లిలోని 28 గృహాల కాలనీ లేఅవుట్ మినహా మిగిలిన చోట్ల కాలనీలను మెరకచేసే కార్యక్రమాలు పూర్తయ్యాయన్నారు. అన్ని కాలనీలకు విద్యుత్ సరఫరా ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. నిర్మాణాల కోసం అవసరమైన నీటికోసం ప్రత్యేక బోర్లు ఏర్పాటు చేశామని, అవి లేని ప్రాంతాల్లో గ్రామ పంచాయతీల సహకారంతో సమీపంలోని నీటివనరుల నుంచి నీటి సరఫరాకు చర్యలు చేపట్టామన్నారు. ఇదే క్రమంలో కాలనీలకు రవాణా సామగ్రి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్లు లబ్ధిదారుల అవసరాలకు అనువుగా ఉన్నాయన్నారు. కొన్నిచోట్ల ఈ తరహాలో ఏర్పాటు చేసిన రోడ్లు రవాణా వాహనాలు ఎక్కువగా తిరగడం వల్ల కొన్నిచోట్ల పాడయ్యాయని, వాటికి మరమ్మతులు చేయాల్సి ఉందన్నారు. మండలస్థాయిలో లబ్ధిదారులకు అవసరమైన ఇసుక, సిమెంట్, ఐరన్, గృహ నిర్మాణాల కోసం రాయితీపై సంస్థ అందజేసే శానిటరీ, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ సామగ్రిని గోదాముల వద్ద అందుబాటులో ఉంచామన్నారు. భీమడోలులోని సంస్థ కార్యాలయం వద్ద ఐరన్ నిల్వలున్నాయన్నారు. ఈ మేరకు మండల స్థాయి గోదాముల వద్ద 76 టన్నుల ఇనుము, 108 టన్నుల సిమెంట్, వెయ్యి టన్నుల ఇసుక పంపిణీకి సిద్ధంగా ఉందని తెలిపారు. లబ్ధిదారులకు రూ.1.80 లక్షలకు అదనంగా రూ.35 వేలు డ్వాక్రా రుణాలు అందజేస్తుందన్నారు. ఈ మొత్తాలతో గృహ నిర్మాణాలు చేపట్టేందుకు సంస్థ మధ్యవర్తిత్వంతో కొంతమంది గుత్తేదారులు నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. గృహనిర్మాణాలను వేగవంతం చేసేందుకు మరొక పర్యాయం అవగాహన సదస్సులు, ఇతర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు భీమడోలు సహాయ ఇంజినీర్ తెలిపారు.

నిర్మాణంలో ఇళ్లు

ఎస్‌సి,ఎస్‌టి సబ్‌ప్లాన్‌ను శాశ్వతంగా కొనసాగించాలి

ప్రజాశక్తి - భీమడోలు

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టాన్ని శాశ్వతంగా కొనసాగించాలని కెవిపిఎస్ మండల శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు గుండుగొలనులో మండల శాఖ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు టి.సుమన్‌బాబు మాట్లాడుతూ 1974-75లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ సబ్‌ప్లాన్‌ను తీసుకొచ్చారన్నారు. 2015లో నిబంధన పేర అప్పటి కేంద్ర ప్రభుత్వం పదేళ్ల కొనసాగింపునకు అనుమతిచ్చిందన్నారు. ఈ గడువు జనవరి 23తో ముగుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం దానిని శాశ్వత కొనసాగింపునకు ఆదేశాలు జారీచేయాలని కోరారు. దీని సాధనకు కెవిపిఎస్ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు సహకరించాలని బాధ్యులను ఆయన కోరారు.

24న చేతివృత్తిదారుల సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు

ఈనెల 24న ఏలూరులోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతివృత్తిదారులకు రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించిన నిధులు వృత్తిదారుల అభివృద్ధికి, సంక్షేమానికి ఖర్చు చేయాలన్నారు. సామాజిక రక్షణ సబ్సిడీలతో కూడిన రుణాలు మంజూరు చేయాలని కోరారు. వీటి సాధనకు జరుగుతున్న సదస్సుకు ముఖ్యఅతిథిగా ఎపి మత్స్యకారుల, మత్స్య కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కొల్లేటి శ్రీనివాసరావు హాజరవుతున్నారని, జిల్లాలోని చేతివృత్తిదారులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో క్షౌరవృత్తిదారుల సంఘం నాయకులు వి.కిషోర్, పురం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం : టిడిపి

ప్రజాశక్తి - టి.నరసాపురం

వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని టిడిపి మండల అధ్యక్షులు నాయుడు రామకృష్ణారావు గౌడ్ విమర్శించారు. తెడ్లం గ్రామంలో ఆదివారం టిడిపి ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం జగన్ పాలనలో నిత్యావసర వస్తువులు, పెట్రోల్ డీజిల్ ధరలు ఆకాశాన్నంటాయన్నారు. టిడిపి హయాంలో నిర్మించిన ఇళ్లకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతులకు ఎరువులు, డ్రిప్ ఇరిగేషన్, ఆయిల్‌పామ్ మొక్కలు సబ్సిడీపై ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో యువతకు భవిష్యత్ లేదని విమర్శించారు. రాష్ట్రంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సిఎం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామ్మూర్తి, సొసైటీ మాజీ అధ్యక్షులు బొంతు సత్యనారాయణ, ఆచంట సూర్యనారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షులు కృపాకర్ రెడ్డి, నాయకులు బండి శ్రీనివాసరావు, శౌరి పాల్గొన్నారు.

ఆయుష్మాన్‌భారత్‌పై అవగాహనుండాలి

ప్రజాశక్తి - ముసునూరు

ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమాపై ప్రజలకు అవగాహనుండాలని ఎంపిడిఒ రాణీ అన్నారు. ఆదివారం ముసునూరులో సచివాలయం సిబ్బంది, వాలంటీర్లతో కలిసి ఆమె ఆయుష్మాన్‌భారత్ బీమా లబ్ధికోసం ప్రజల నుంచి వేలిముద్ర తీసుకున్నారు. ఈ సర్వే పూర్తిస్థాయిలో త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆమెవెంట ఇఒపిఆర్‌డి బసవరాజు, అచ్యుత సత్యనారాయణ, ఎఒ కూచిపూడి సాయిరామ్ ఉన్నారు.

ఆయుష్మాన్ భారత్‌కు వేలిముద్రలు సేకరిస్తున్న అధికారులు, వాలంటీర్లు

అస్తవ్యస్తంగా రోడ్డు విస్తరణ పనులు

వ్యాపారులు, ప్రజలు అవస్థలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

పామర్రు - దిగమర్రు 165 జాతీయ రహదారి పనులు ముదినేపల్లి మండలంలో ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ముదినేపల్లి సెంటర్‌లో నాలుగు లైన్ల రహదారి విస్తరణ పనులు కంట్రాక్టర్ చేపట్టారు. కంట్రాక్టర్ తొలుత డ్రెయిన్ల నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేశాడు. దీంతో వాహనదారులు, ప్రజలు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక బస్టాండ్, ఎస్‌బిఐ వద్ద రోడ్డుకు ఇరువైపులా కొంతమేర డ్రెయిన్ల నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలేశాడు. దీంతో ఇటు వ్యాపారులు, అటు ప్రజలు అవస్థలు పడుతున్నారు. దుకాణాల ముందు డ్రెయిన్ల నిర్మాణ పనులు చేపట్టి మధ్యలో ఆపివేశారు. దుకాణాలు ముందు పెద్దపెద్ద గుంతల కారణంగా ప్రజలు రాకపోవడంతో బేరాల్లేక ఇబ్బందిపడుతున్నామని వ్యాపారులు వాపోయారు. అంతేకాక అసంపూర్తిగా వదిలేసిన పనులు వల్ల ఏర్పడ్డ పెద్దపెద్దగోతుల్లో మురుగునీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోందని వ్యాపారులు వాపోతున్నారు. కంట్రాక్టర్ స్పందించి ప్రమాదకరంగా ఉన్న డ్రెయిన్ల నిర్మాణ పనులు వెంటనే చేపట్టి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కిరాణా షాపు ఎదుట తవ్వి వదిలేసిన గొయ్యి

విఆర్‌ఎలకు నైట్‌డ్యూటీలు దారుణం

ప్రజాశక్తి - గణపవరం

విఆర్‌ఎలకు నైట్ డ్యూటీ సర్టిఫికెట్స్ ఉంటేనే జీతం ఇస్తామని, అలాగే నైట్ డ్యూటీ చేయాలని ఒత్తిడి చేయడం పట్ల విఆర్ఎల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.ఆంజనేయులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక బిటి రణదివె భవనంలో జరిగిన విఆర్ఎల మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఏనాడూ లేని విధంగా విఆర్ఎలు డ్యూటీ సర్టిఫికెట్ ఉండాలని రాత్రి సమయంలో కార్యాలయం వద్ద నైట్ డ్యూటీ చేయాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తేవడం దారుణమన్నారు. మండలంలో మారుమూలల్లో ఉన్న కార్యాలయాల్లో రాత్రి సమయంలో అనారోగ్యానికి గురైతే సమాధానం ఎవరు చెబుతారని ఆయన ప్రశ్నించారు. విఆర్ఎల వయసుతో నిమిత్తం లేకుండా నైట్ డ్యూటీ చేయాలని ఉన్నతాధికారులు చెప్పడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. డ్యూటీ సర్టిఫికెట్ పద్ధతి పెట్టి విఆర్ఎలపై కక్షసాధింపు చర్యలకు అవకాశం ఇవ్వడం కొత్త సమస్యలకు దారి తీయడం అవుతుందన్నారు. ఉన్నతాధికారులు ఈ సమస్యపై చొరవ తీసుకొని సమస్య పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళన తప్పదని హెచ్చరించారు. సమావేశంలో పాల్గొన్న సిఐటియు మండల అధ్యక్షులు ఎం.పెంటారావు మాట్లాడుతూ విఆర్ఎలపై పనిఒత్తిడి పెంచడం పిచ్చుకపై బ్రహ్మాస్త్రం ప్రయోగించడమేనన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారి జీతాలు పెరగకపోవడం వల్ల చాలీచాలని జీతాలతో సతమతమవుతున్నారన్నారు. గత ప్రభుత్వం ఇస్తున్న డిఎను జగన్ ప్రభుత్వం నిలిపివేయడం దారుణమన్నారు. ప్రభుత్వం విఆర్ఎల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన తప్ప మరో మార్గం లేదన్నారు. ఈ సమావేశంలో విఆర్ఎలు ఏరిచర్ల వెంకటరావు, చిలగా శ్రీను, సాయి, లక్ష్మి, నారాయణ, బుల్లిపాప, ఉస్సేను పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే సిఎం జగన్ లక్ష్యం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - మండవల్లి

రాష్ట్ర అభివృద్ధికి సిఎం జగన్ కృతనిశ్చయంతో ఉన్నారని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు పేర్కొన్నారు. స్థానిక స్టేషన్ రోడ్డులో రూ.ఐదు లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి అభివృద్ధి చేస్తున్నామన్నారు. అంతేకాకుండా గ్రామాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని సత్వర పరిష్కారం చూపే విధంగా గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన ముఖ్య సమస్యలను తక్షణం పరిష్కరించే విధంగా ఒక్కొక్క సచివాలయానికి రూ.20 లక్షల నిధులను మంజూరు చేశామన్నారు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ప్రజల అండదండలు, సహకారం మెండుగా ఉన్నాయన్నడానికి సీసీ రోడ్డు నిర్మాణమే నిదర్శనమన్నారు. సీసీ రోడ్డు నిర్మాణంతో ఆ ప్రాంత ప్రజల చిరకాల కోరిక తీరిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, పార్టీ మండల అధ్యక్షులు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచి మండా జాన్సీ, రైతు సంఘం నాయకులు చేబోయిన వీర్రాజు, పిఎసిఎస్ అధ్యక్షులు బొమ్మనబోయిన గోకర్ణ యాదవ్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు బేతపూడి ఏసేపు రాజు, గుడివాడ మురళీ, మండా సురేష్, కాంట్రాక్టర్, కొల్లా సాయి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు

కుక్కలతో ప్రజలు బెంబేలు..!

గుంపులుగుంపులుగా సంచారం
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు పట్టణ, పరిసర ప్రాంతాలలో రోజురోజుకీ వీధి కుక్కల బెడద తీవ్రమవుతోంది. ప్రతివీధిలోనూ గుంపులుగుంపులుగా కుక్కలు చెలరేగిపోతున్నాయని పట్టణవాసులు బెబేలెత్తుతున్నారు. మార్నింగ్ వాకర్స్, పేపర్ బాయ్స్, పాల ప్యాకెట్ల వాళ్లు, కూరగాయలు అమ్మేవాళ్లు వీధి కుక్కల బెడదతో నిత్యం నరకం చూస్తున్నారు. ఎక్కడ చూసినా పదుల సంఖ్యలో కుక్కలు గుంపులు గుంపులుగా కనిపిస్తున్నాయని వాపోతున్నారు. పలుమార్లు స్పందన కార్యక్రమంలో అర్జీలు సమర్పించినప్పటికీ వీధి కుక్కలను తరమడంలో అధికారులు ఏమాత్రమూ స్పందించడం లేదని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లల్లో పనులు చేసే వాళ్ళు సైతం వీధి కుక్కలను చూసి భయకంపితులవుతున్నారు. నిత్యం వీధి కుక్కల దాడిలో గాయపడుతున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. పల్లెల్లో, పట్టణాల్లో వీధి కుక్కలు దాడి చేయడంతో చిన్నారులు, పెద్దలు సైతం తీవ్రమైన గాయాలతో ప్రభుత్వాసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

25న ఎల్ఐసి, ఎఐ జనరల్‌బాడీ సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు

ఈనెల25న ఎల్ఐసి, ఎఐ జనరల్‌బాడీ సమావేశం స్థానిక పవర్‌పేటలోని ఉద్దరాజు రామం భవనం(సిపిఎం ఆఫీస్)లో నిర్వహిస్తున్నట్లు సమావేశ ఆహ్వాన సంఘం అధ్యక్షులు గద్దె విజయభాస్కర్ తెలిపారు. ఆదివారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన ఆహ్వాన సంఘ సమావేశంలో విజయభాస్కర్ మాట్లాడారు. ప్రతీ సంవత్సరం జనరల్ వార్షికోత్సవ సభ జనవరిలో జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో వార్షిక సభ నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ హాజరవుతారన్నారు. ఈ సభకు ఏజెంట్ మిత్రులు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎల్ఐసి, ఎఐ బ్రాంచ్ అధ్యక్షులు పి.శ్రీరాంప్రసాద్, జనరల్ సెక్రటరీ తాళం సురేష్, కోశాధికారి వైఎస్.కనకారావు, స్టేట్ జనరల్ సెక్రటరీ జి.రవికిషోర్, సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు

గ్రామ ఐక్యతకు సంబరాలు ప్రతీక : డిఎన్ఆర్

ప్రజాశక్తి - కైకలూరు

గ్రామ ఐక్యతకు అమ్మవారి సంబరాలు ప్రతీక అని శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం సతీసమేతంగా మండలంలోని ఆటపాకలో గంగానమ్మ ఆలయ తొమ్మిదో వార్షికోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడివి వెంకటకృష్ణ మోహన్, కైకలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్ పంజా రామారావు, ఉప సర్పంచి పాము, నాయకులు రమేష్, నారాయణ పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ మానవత్వం

ప్రజాశక్తి - ఏలూరు

అనారోగ్యంతో రోడ్డున పడి ఉన్న మతిస్థిమితం లేని ఒక వృద్ధుడి ఆరోగ్య పరిస్థితిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. వివరాల్లోకి వెళితే జంగారెడ్డిగూడెం పట్టణంలోని కొవ్వూరు రోడ్డు బస్టాప్ వద్ద అనారోగ్యంతో బాధపడుతూ, మతిస్థిమితం లేని ఒక వృద్ధుడిని చెత్త ట్రాక్టర్‌లో శనివారం బతికుండగానే శ్మశానవాటిక షెడ్ వద్దకు తరలిస్తున్నారంటూ ప్రసార మాధ్యమాలు, సామజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న కలెక్టర్ వెంటనే స్పందించారు. మునిసిపల్, పంచాయతీ అధికారులను ఆ స్థలానికి పంపించి ఘటనపై తనకు అత్యవసరంగా నివేదిక అందించాలని ఆదేశించడంతో, అధికారులు ఉరుకులు, పరుగులతో వృద్ధుడి దగ్గరకు చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ వృద్ధుడు కాకినాడకు చెందిన కోరుకొండ రామ్మోహనరావు అని, నాలుగు రోజులుగా బస్ షెల్టర్ వద్ద ఏమీ తినకుండా, అనారోగ్యంతో బాధపడుతుండటం తో పరిశీలించిన మున్సిపల్ సిబ్బంది ఆసుపత్రిలో చేర్పించేందుకు ట్రాక్టర్‌లో తీసుకువెళుతున్నారని, పరిస్థితిపై కలెక్టర్‌కు నివేదిక అందించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ వెంటనే రామమోహనరావును జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాలని వైద్యాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వైద్య సిబ్బంది శనివారం అర్ధరాత్రి వరకూ, ఆదివారం కూడా రామ్మోహనరావు ఆరోగ్య పరిస్థితిపై కలెక్టర్ ఆరా తీశారు. ఆయన పూర్తిగా కోలుకున్నారని వైద్యులు కలెక్టర్‌కు తెలిపారు. ఆయనను వృద్ధాశ్రమంలో చేర్పించాలని కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక తహశీల్దార్ స్లీవ జోజి తన సిబ్బంది, డిప్యూటీ తహశీల్దార్ రమేష్, సామాజిక కార్యకర్త ధనకుమార్, వృద్ధాశ్రమం ప్రతినిధి జయవరపు శేఖర్‌తో కలిసి ఆదివారం ఉదయం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడిని పరామర్శించి ఆయనకు నూతన వస్త్రాలను అందించారు. ఆరోగ్యం కుదుట పడిన తర్వాత స్థానిక సీతామహాలక్ష్మి వృద్ధాశ్రమానికి ఆయనను తరలించేందుకు నిర్వాహకులతో మాట్లాడారు.

మహారాజ శ్రీ నూజివీడు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
యస్.ఓ.పి.నెం. 228/2022

బిట్వీన్:
1) భూక్యా నాగమణి
2) భూక్యా గణేష్ కుమార్
3) భూక్యా విజయ్ కుమార్
...పిటీషనర్స్

మరియు

1) భూక్యా వెంకటేశ్వర్లు
2) లకావతు లక్ష్మి
3) సప్తగిరి గ్రామీణ బ్యాంక్ వినగడప బ్రాంచ్ తరపున బ్రాంచ్ మేనేజర్
...రెస్పాండెంట్స్

యిందుమూలముగా యావన్మందికి ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా.., పై పిటీషన్‌లోని 1వ పిటీషనరుకు భర్త మరియు 2, 3 పిటీషనర్సుకు తండ్రి గారైన భూక్యా శ్రీను అనే శ్రీనివాసరావు ది.15-12-2019వ తేదిన ఇంటస్టేట్‌గా మరణించియున్నారు. సదరు శ్రీనుకు రావలసిన ఇన్సూరెన్స్ సొమ్ము 3వ రెస్పాండెంట్ బ్యాంకులో సదరు భూక్యా శ్రీనివాసరావు గారి తల్లి గారైన భూక్యా కమలకు చెందిన ఎకౌంటులో జమకాబడియున్నవి. తదుపరి సదరు భూక్యా కమల గారు కొంత సొమ్ము విత్‌డ్రా చేసుకొనియున్నారు. దర్మిలా సదరు భూక్యా కమల ది.10-12-2020వ తేదిన మరణించియున్నారు. ప్రస్తుతం సదరు ఎకౌంటులో వున్న రూ.1,50,678/- లను మరియు దానిపై వచ్చు వడ్డీని సదరు భూక్యా శ్రీనివాసరావు ముఖ్య వారసులైన పిటీషనర్సుకు తీసుకొనుటకు గానూ, వారు సక్సెషన్ సర్టిఫికేట్‌ను కోర్టు ద్వారా పొంది, తద్వారా పైతెలిపిన సొమ్మును పొందుటకు గానూ పై తెలిపిన పిటీషనర్స్, పై నెంబరు సక్సెషన్ ఓ.పి. దాఖలు చేసుకొనియున్నారు. సదరు పై తెలిపిన పిటీషనర్స్, సదరు మరణించిన భూక్యా శ్రీనివాసరావు గారి యొక్క వారసులుగా శ్రీ కోర్టువారి వద్దనుండి సక్సెషన్ సర్టిఫికేట్ పొందుటలో ఎవరికైననూ ఏ విధమైన అభ్యంతరములు వున్న యెడల **ది.14-02-2023వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై తెలిపిన శ్రీ కోర్టువారి ఎదుట ప్రత్యక్షముగా గానీ, మీ న్యాయవాది గారి ద్వారా గానీ హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు.** లేనిచో పై తెలిపిన పిటీషనర్స్ సదరు మరణించిన శ్రీ భూక్యా శ్రీనివాసరావు గారి వారసులుగా భావించి, కోర్టువారు తగు ఉత్తర్వులను జారీ చేయగలరని తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
మంకెన నరసింహారావు,
నూజివీడు, 22-1-23. పిటీషనర్స్ తరపు న్యాయవాది, నూజివీడు, ఏలూరు జిల్లా.